# వియోగాంతే

శారదా! బాబుకి పాలిచ్చావా? అంది అత్తగారు లైట్ ఆఫ్ చేస్తూ.

'తాగాడండి' అంది శారద.

'పది దాటినా నువ్వింకా నిద్రపోలా?' అంది అత్త గారు తన పక్కమీద పడుకుంటూ.

'పడుకుంటానండి' అంది శారద కిటికీవైపుకు ఒత్తిగిలుతూ.

కిటికీలోంచి గదిలోకి వెన్నెల పడుతోంది. శారదకి నిద్ర రావడంలేదు. రాజు మీదికి మనసు పోయింది. రాజు ఏం చేస్తుంటాడో? ఏ నైట్ క్లబ్‌కో పోయుంటాడా? ఊహుఁ! తన గదిలో కూర్చుని చుట్టూ పుస్తకాలు పేర్చుకుని థీసిస్ రాసుకుంటుంటాడు.

అప్పట్లో రాజు ఎం. ఎస్సి. చదువుతున్నాడు. ఆ క్రితం సంవత్సరమే తను బి. ఎస్సి. పూర్తిచేసి ఆపేసింది. తను పెళ్ళయేనాటికి ఇలా రాజు స్కాలర్‌షిప్ మీద ఫారెన్ వెళ్తాడని ఊహించను కూడాలేదు. పెళ్ళయాక ఇద్దరూ కలిసి ఉంది తొమ్మిది నెలలు మాత్రం. పెళ్ళయిన నాలుగో మాసానే తనకు నెల తప్పింది. రాజు అడిగాడు 'నీకు అమ్మాయా? అబ్బాయా?'

'ఇప్పుడు నిజానికి నాకెవరూ వద్దనుకుంటున్నాను' అంది శారద.

'అట్లా అనకూడదు శారదా.'

ఇంకా కొంతకాలం సరదాగా ఉండకుండా ఇప్పట్నించే ఈ బాదరబందీ ఏవిటి చెప్పు ?'

'అదిగో ! అట్లా అనకు శారదా' అని మెల్లగా అంటూ తన్ని దగ్గరకు తీసికొన్నాడు. మాట్లాడ నివ్వకుండా పెదవులు అడ్డం పెట్టాడు. ఇంక తనేం చేస్తుంది ? తొందరగా తండ్రి కావాలనే కాంక్ష రాజులో ఇంత బలంగా ఉన్నందుకు ఆశ్చర్య పోయింది. నిజానికి తనకి మాత్రం లేదూ తల్లి నవుదామని !

శారదకు నెలలు నిండుతుంటే రాజు ఏవేవో తీసికొచ్చే వాడు. ఏం కావాలో కోరుకొమ్మనేవాడు. కొన్ని చెప్పేది. మర్నాటికి కొనుక్కొచ్చేవాడు. మర్నాడు బజారు కెళ్తూ 'ఏం కావాలి ?' అనడిగేవాడు. తను ఎన్నని చెప్తుంది ! ఇంకేవీ లేవనేది. రాజు చిన్నబుచ్చుకునేవాడు. అతను అడిగి నప్పుడు ఏదో ఒకటి, దొడ్లో పువ్వులున్నా సరే, 'ఓ సన్న జాజి దండ తీసుకురా' అనేది శారద.

ఆ రోజు రాజుకి స్కాలర్‌షిప్ గ్రాంటయినట్లుగా ఉత్తరం వచ్చింది. ఇంట్లో అంతా పొంగిపోయారు. మామ గారు తన కుటుంబంలో మొట్టమొదటి సారిగా తన కొడుకు ఫారెన్ రిటరెండ్ కాబోతున్నందుకు తబ్బిబ్బవుతున్నారు. మరిది, మావగారు పొద్దుట్నుంచి కూర్చుని స్కాలర్‌షిప్ ఎంత వచ్చేది, ఎంత ఖర్చయేది, చేతి దెంత పడేది లెక్కలు కట్టున్నారు. అత్తగారు వంటమనిషి దగ్గిర కూర్చుని ప్రత్యే కంగా స్వీట్సు చేయిస్తోంది. శారద మొదట్లో అందరితో పాటు తనూ సంతోషించింది. కాని తాపీగా తలుచుకుంటే భయం వేసింది. మూడు సంవత్సరాలు రాజును విడిచి ఉండట మెట్లా ? రాజు పార్లిపోతున్న సంతోషంతో పరుగెత్తుకొచ్చి

చైతన్యం లేనట్టు నుంచున్న శారదని కౌగలించుకున్నాడు. అంతలో బయట నుంచి ఫ్రెండ్స్ కేకేశారు. వాకిట్లోకి పరుగెత్తాడు రాజు.

రాజు రాత్రి తిరిగొచ్చేప్పటికి పొద్దుపోయింది. శారద ముభావంగా వడ్డిస్తోంది.

'నువ్వుకూడా కూర్చో' అన్నాడు రాజు.

'తర్వాత' అంది శారద.

'అలా అయితే నే తినను బాబూ' చిన్న పిల్లాడి మారాం చేశాడు రాజు.

అలవాటయిన ఆ మొండితనానికి శారద సన్నగా నవ్వుకుని 'నువ్వు కూర్చో నేను ప్లేట్ తెచ్చుకుంటా' అంటూ వంటింట్లో కెళ్ళింది.

'మళ్ళీ ఎన్నాళ్ళకో ఇద్దరం కలిసి భోం చేసేది' అన్నాడు రాజు.

శాదర వంటింట్లోంచి తిరిగి రాలేదు. కాస్తాగి ఎక్కిళ్ళు విన్పించినై. రాజు అన్నం ముందునుంచి లేచి వంటింట్లోకి పరుగెత్తాడు.

'ఏమిటి శారదా! ఎందుకు ఏడుపు? ఎవరేమన్నారు? చేతుల్తో శారద నడుంచుట్టు అడిగాడు.

తన్నినట్లు శారదలోంచి దుఃఖం బయటకు దుమికింది. ఎక్కిళ్ళు మరీ ఎక్కువై రాజు బుజంమీద వాలిపోయింది.

'ఏమిటి శారదా ఎందుకు? మా అమ్మ ఏమన్నా అందా?'

'ఉహు' అంది శారద రాజు బుజంమీద కళ్ళు రుద్దుకుంటూ.

'మరెందుకు నామీద కోపమా?'

'ఊహుఁ' అంది శారద రాజు బుజం మీదించి తల తీసికొంటూ.

'మరెందుకు ?'

'నువ్వు మళ్ళా తిరిగి ఎప్పు డొస్తావ్ ? నేల చూస్తూ అంది. శారద కింది పెదవి వొణుకుతోంది.

'దానికా...అయ్యొయ్యొ! చదువుకున్న దానివి, నువ్వు కూడా ఇట్లా ఏడవ్వొచ్చా ? ఎవరన్నా చూస్తే నవ్వుతారు.' అంటూ రాజు శారద తల పైకెత్తాడు. కన్నీళ్ళ కళ్ళు ముద్దు పెట్టుకున్నాడు.

'ముందు కళ్ళు తుడుచుకో! నేనంతా చెప్తాగా...ఏదీ నవ్వు...నవ్వుతూ ఉండాలి...నవ్వు...నవ్వు...' శారద ముఖంలోకి లాలనగా చూస్తూ అన్నాడు రాజు.

'నాకు నవ్వు రాదు' అంది శారద. తను ఎలా నవ్వుతుందీ విషం మింగుతూ!

'మహాచక్కగా వస్తుంది. నవ్వు నవ్వకపోతే నా మీద ఒట్టే. ఏదీ నవ్వు, నవ్వు.'

శారద నవ్వింది; పంజరంలో చిలక ఆహారం కోసం నవ్వినట్లుగా, ఖైదీ తనకు కొడుకు పుట్టాడన్న వార్త విని నవ్వినట్లుగా,

ఇద్దరూ మాట్లాడకుండా భోజనం చేస్తున్నారు. మధ్యలో రాజు అన్నాడు 'పుట్టబోయే పాపాయిని ఎలాగూ ఫారెన్ పంపించాలి గదా. ఆ ప్రదేశాలెట్లా ఉంటాయో ఒక్కసారి చూసొద్దామని వెళ్తున్నాను.

శారద పెదవుల కొనసన నవ్వు మొగ్గతొడిగింది. "పోన్లే వాడయినా వాళ్ళమ్మని తీసికెళ్తాడు" అంది.

రాజు ఓరగా చూసి అన్నాడు 'నేను ఒంటిగా వెళ్తున్నాననేగా. పోన్లే అప్పుడు వాళ్ళ నాన్నని కూడా తీసికెళ్ళమని రికమండ్ చెయ్యేం!

శారద పెద్దగా నవ్వింది. ఆ నవ్వులో కోలమారింది.

పక్కమీద పడుకుని శారద కిటికీలోంచి చీకట్లో చెట్లని, మెరిసే నక్షత్రాల్ని, ఆ వెనక ఆకాశం నలుపుని చూస్తోంది.

"నిద్రొస్తుందా?" అన్నాడు రాజు శారదని దగ్గరికి తీసుకొంటూ.

'ఉహు' అని తల ఆడించింది శారద.

'నా ప్రయాణం గురించి నీ అభిప్రాయం చెప్పావు కాదు, అన్నాడు రాజు.

ఇప్పుడా...ఇప్పుడా అడిగేది! అంతా తయారయింతర్వాత. ఏదో ఆడగాలి గాబట్టి అడిగినట్టు – అనుకుంది శారద.

'నేవద్దంటే ఆగిపోతావా? అంది' శారద.

రాజు కొంచెం ఆలోచనగా చూశాడు. 'నిజంగా నీ కిష్టం లేకపోతే వెళ్ళను' అన్నాడు.

"నువ్వు డాక్టరువయి పెద్ద ఉద్యోగం చెయ్యటం నాకు మాత్రం ఇష్టం కాదా. కాని రాజూ! ఒక్క టడుగుతాను చెప్పు, మనం ఒక ఎమోషనల్ ఇంటెగ్రిటీ కోసం పెళ్ళి చేసికొన్నాం. దాన్ని పోస్ట్‌పోన్ చేయటం ఏం సమంజసం?'

రాజు మౌనం పట్టాడు. నే వెళ్ళి తీరాల్సిందే అని రాజు అనివున్నా బావుండేది. శారదకి ఈ మౌనం అంతకంటె

బాధగా ఉంది. నిశ్శబ్దం పగలగొట్టి రాజు అన్నాడు. "నిజమే శారదా! నన్నేం చేయమంటావో చెప్పు. ప్రయాణం మానెయ్యనా?

శారద కాస్సేపు మాట్లాడలేదు. తలెత్తి రాజు కళ్ళ లోకి చూసింది. అతడి కళ్ళలో ఆందోళన రంగులరాటం తిరుగుతోంది. మూడు సంవత్సరాలు; కొన్ని వేల రోజులు రాజు తనను విడిచి సముద్రాలు దాటి వెళ్తున్నాడు. తను వద్దంటే ఆగిపోతాడు. కాని ఎలా? రాజు భవిష్యత్తులో గొప్పవాడవుతాడు. అతనికీ వెళ్ళాలని ఉత్సాహంగా ఉంది. కొంత త్యాగం జరగాలి. తన సుఖం కొంత త్యాగం చేయాలి. అందులో అగాధంలాంటి దుఃఖం ఉంది. కాని ఎలా?...తప్పదు. భర్తకోసం తన సుఖాన్ని స్వాహా చేసే పాతకాలపు స్త్రీకి తనకి తేడా ఏముంది? ఇప్పుడు దాన్నే తను కాంప్రమైజ్ అంటోంది. అంతే.

'వెళ్ళిరా, రాజూ వెళ్ళిరా...గద్గదంగా' అంది శారద. రాజు మెడ చుట్టూ చేతులు వేసి దగ్గిరికి లాక్కుంటూ.

'నీకు దూరంగా ఉండటం నాకు మాత్రం బాధ కాదూ. మూడు సంవత్సరాలు మూడు నిముషాల్లో గడిపి వస్తాను. సరేనా!'

బడబానలం లా సెగలా పొగిలిన శారద నిశ్వాసాల్లో శారద ముఖాన్నంతా పదే పదే చుంబించాడు రాజు.

'తిరిగి నే వచ్చేప్పటికి నాకు రత్నం లాంటి పాప నిస్తావా?' శారద గర్భం నిమురుతూ, అన్నాడు రాజు.

'పిచ్చి...రాజు' రాజు తలని గట్టిగా వక్షానికి హత్తుకుని జుట్టు ముద్దు పెట్టుకుంది శారద.

బాబుకి మూడేళ్ళు నిండుతున్నాయి. ఏ వస్తువూ ఉన్న చోట ఉండడం లేదు. బాబు తాతగారి కళ్ళజోడు లాక్కుని పరుగెత్తుతుంటే ఆయన 'ఇవ్వరా' అంటూ వాడి వెనకాలే ఇల్లంతా పరుగెత్తుతున్నాడు. వాళ్ళ నాయనమ్మకి బాబు తప్ప మరో లోకం లేదు. వాడికి అలంకారాలు చేస్తుంది. ఒక్కొక్కసారి గాను తొడిగి, సన్నగా జడ అల్లి పువ్వులు పెడుతుంది 'ఏ ఆడపిల్లా!' అని ఆడుకుంటుంది. బాబుతలనున్న చెండు లాగేసుకుంటాడు. 'బాబు నవ్వీన బోసి నవ్వులు, వేసిన తప్పటడుగులు, వచ్చీరాని పిలుపులు.' ఈ చిలిపి అల్లరి రాజు కెలా తెలుస్తాయి, అనుకునేది శారద. రాజుకి రాసే ప్రతి ఉత్తరంలోను బాబు చేసే అల్లరి కలిగించే సందడి పిక్చర్స్ ఇస్తూ రాసేది. కాని అవి పిక్చరైజ్ అవుతాయా? ఆ అనుభూతులు మాటల్లో ఇముడుతాయా? తను పొందే వేదన ఉత్తరాల్లో వ్యక్తమవడం ఎంత అసాధ్యమో, బాబు సమ్ముఖంలో కలిగే సంతోషమూ అంతే. రాజు అక్కడినుంచి బాబుకి ప్రత్యేకంగా ప్రెజెంట్స్ పంపేవాడు. మూడు నెలల కోసారి బాబు ఫోటోలు రాజుకీ పంపుతోంది శారద.

శారద బాబుని ఒళ్ళో కూర్చోపెట్టుకుని రాజు ఫోటో చూపించి 'ఎవరో చెప్పు' అంది.

'బొమ్మ' అన్నాడు బాబు.

''కాదు నాన్న...అను...నా...ఆ......న్న'' అంది శారద.

'నా...ఆ...న్న' ఒత్తి అన్నాడు బాబు.

ఆ రోజు ఇంటికి అత్తగారి వైపు చుట్టా లొచ్చారు.

ఆ వచ్చి నాయనకి ఇద్దరు కొడుకులు. వాళ్ళతో కలిసి ఆడు కుంటున్నాడు బాబు. ఆటలో, ఆయన కొడుకు లిద్దరూ ఆయన మీదకెక్కి "నాన్నోయ్" అని అరుస్తున్నారు. బాబు కూడా 'నాన్నోయ్' అంటూ ఆయన ఒళ్ళో ఎక్కి కూర్చు న్నాడు.

'మీ నాన్న కాదు మా నాన్న' అన్నారు ఆ పిల్ల లిద్దరూ. 'మా నాన్నే' అంటూ ఆయన ఒళ్ళో మరీ ఒదిగి కూర్చున్నాడు బాబు.

ఇది చూస్తున్న శారద గబుక్కున లేచి వచ్చి "ఛీ! తప్పు" అని బాబుని లోపలికి తీసికెళ్ళింది.

'ఆయన నాన్న కాదమ్మా... బాబాయి' అంది శారద.

'మరి మా నాన్నేడీ ?'

"వస్తాడు ... రేపొస్తాడు" అని బాబుని కౌగిట్లోకి తీసికొంది. ఏవిటీ చిత్రహింస! తండ్రిలేని పిల్లాడిలా బాబు ఇలా ఉండట మేమిటి — అనుకుంది శారద.

బాబుని ఒళ్లోకి తీసికొని చెపుతోంది. 'నాన్నొస్తాడు. నిన్నెత్తుకుంటాడు .... నిన్ను కార్లో షికారు తీసికెళ్తాడు ...'

'అప్పుడు నేను హారన్ వాయిస్తా.'

'ఊఁ వాయిద్దుగాని. నీకు బోలెడు చాక్లెట్లు తెస్తాడు.'

"బొమ్మలు కూడా"

'ఆఁ! బొమ్మలుకూడా తెస్తాడు...' శారద స్వరంలో అశ్రులు కదులుతున్నాయి.

బాబు శారద వొళ్ళోంచి దూకి హాల్లో ఆడుకుంటున్న పిల్లల దగ్గరికి పరుగెత్తి చెప్తున్నాడు. 'మా నాన్నే మో ...

రే పోస్తాడు ... మేం కార్లో వెళ్తాం .... నే నేమో హారన్ వాయిస్తానూ ... ... మా నాన్న నాకు ఇన్ని చాక్లెట్లు తెస్తాడు ... ఇన్ని బొమ్మలు' —

ఒక రోజు మామగారు ఆయన గదిలో కూర్చుని ఉత్తరం రాసుకుంటున్నాడు. బాబు వెనకాలే వెళ్లి పెన్ లాగేసు కున్నాడు.

'ఒరేబ రేఅ పెన్ ఇవ్వు నాయనా' అన్నాడు మామగారు.

"నా క్కావాలి."

"నే ఉత్తరం రాయాలి; మీ నాన్నకి ఉత్తరం రా యొద్దూ."

'నేను కూడా రాస్తా నాన్నకి ఉత్తరం.'

'అయితే ఇంకో పెన్ ఇస్తా ఉండు.' అని ఇంకో పెన్ కాగితం తెచ్చి ఇచ్చాడు మామగారు.

'ఉత్తరం రాయనా—రాయనా' అన్నాడు బాబు తాతగారి వైపు చూస్తూ. వాడికీ తెలుసు తనకు రాయడం రాదని.

'రాయి—రాయి' అన్నాడు మామగారు.

బాబు చేతిలో కలం ఇమడటంలేదు. నోటితో అంటూ పెన్‌తో గీతలు గీస్తున్నాడు. 'నాన్నోయ్' నువ్వు తొందరగ రా—వచ్చేటప్పుడు అన్నీ కొనుక్కు-రా—అమ్మ మంచిది.'

'మరి తాతయ్య ?'

'తాతయ్య మంచిది,'

'మరి నాయనమ్మ.'

'మంచిది కాదు.'

'నాయనమ్మ రా—నాయనమ్మ'

'మంచిదే—నాయనమ్మ మంచిది.'

'ఇక చాల్లే ఆ కలం ఇటు తే, ఆ ఉత్తరం మీ అమ్మకి ఇచ్చిరా.' ఆ కాగితం తీసికొని బాబు శారద దగ్గిరికి పరు గెత్తుకొచ్చాడు 'అమ్మోమ్మయ్! అమ్మా! నాన్నకి ఉత్తరం రాశా' అని కాగితం అందించాడు బాబు.

శారద ఆ కాగితం చూచింది. అందులో వంకర టింక రగా గీతలు, చిక్కుపడిన పసి ఊహల జలతారు.

అ రోజునే రాజునుంచి ఉత్తరం వచ్చింది. తన థీసిస్ యాక్సెప్ట్ చేశారని ఒక ఆర్నెల్లు లెక్చర్ టూర్ ఉందని అది కూడా పూర్తి చేసికొని వస్తానని రాశాడు.

ఒకరోజు శారద బాబుని తీసికొని షాపింగ్‌కి బయలు దేరింది. బజార్లో నడుస్తున్న జనమంతా శారదకి చిత్రంగా కన్పిస్తున్నారు. ముగ్గురు ముగ్గురు జట్లుగా, అటు భార్య, ఇటు భర్త మధ్యలో కొడుకు. కొడుకు చేతులు చెరొకటి పుచ్చు కొని నవ్వుతూ కేరింతలు కొడ్తు నడుస్తున్నారు. మరి తనో! ఒంటిగా బాబు చేయిపట్టుకుని నడుస్తోంది. దోవలో శారద స్నేహితురాలు మాలిని కన్పించింది. మాలిని ఆర్టిస్ట్. తనీ మధ్య వేసిన కొత్త బొమ్మని చూపిస్తానని వాళ్ళింటికి లాక్కె ళ్ళింది. మాలిని కొంతసేపు లాండ్ స్కేప్సు చూపించింది. ఆ తర్వాత తను వేసిన కొత్త బొమ్మ తెర తొలగిం చింది. అది నిలువెత్తునున్న పునరాగమనం చిత్రం. సిద్ధా ర్థుడు బుద్ధుడై కపిలవస్తుకు తిరిగొస్తున్నాడు. యశోధర, రాహులుడు స్వాగత మివ్వడానికి ఎదురు చూస్తున్నారు. స్త్రీ జాతిలో ఉండే శోకాన్ని, వియోగాన్ని, రంగరించి

యశోధర బొమ్మ గీసింది మాలిని. కొన్ని సంవత్సరాల వేద నాగ్నిలో కాగి ఎఱ్ఱబడ్డ తనువు. యశోధర – కళ్ళలో ఆరిపోలేక ఆరిపోలేక వెలుగుతున్న దీపాల మినుకు మినుకు తనింతవరకూ ఎన్నడూ చూడని నాన్న వస్తున్నాడన్న సంబరంతో ఎదురుచూసే రాహులుడి మీదుగా వీధివైపు దృక్కులు సారించింది. ఆమె చూపులు నిలపలేక పోతుంది. ఆమె దేహం కంపిస్తోంది.

ఏమిటీ వియోగాలకీ, నిరీక్షణలకీ అర్థం? ఏమీలేదు. కొన్ని కోట్ల చీకట్లు గుండెచుట్టూ కమ్ముకోగా, బాధ అనే సమ్మెట దెబ్బలు భరించటం. సముద్రాల ఘోషలు హృదయంలోనే అదుముకుని నిండు కుండలా తొణక్కుండా ఉండటం. అంతు లేని అగాధాల లోతులకి విసిరిపారేస్తే కిక్కురు మనకుండా పైకి చిరునవ్వు నవ్వటం. అసలు స్త్రీ జాతికి అర్థమేమిటి నా మొహం? అర్థమూ, ప్రయోజనమూ ఏవన్నా ఉంటే అవి పురుషుల జీవితాలకే. వాళ్ళు కారణ జన్ములు. స్త్రీ ఎప్పుడూ వాళ్ళని ఆలంబనగా చేసికొని పాకే తీగ. కావా లన్నప్పుడు నీవు నా జీవిత యామినివి, నాకు మణి భూషవు అంటాడు. కాకపోతే బంధం అని కాలితో నెట్టేస్తాడు. కొందరు కరుగ్గా తంతారు. కొందరు ఫ్లెక్సిఫూజ్‌తో సున్ని తంగా పక్కకు ఒత్తగించి వెళ్ళిపోతారు. అంతే.

శారద బాబుని చూసింది. బాబు చిత్రంలోని రాహు లుణ్ని చూస్తున్నాడు. బాబు తన తండ్రి ఎలా ఉంటాడను కుంటున్నాడో – తండ్రి 'రా నాయనా' అని ప్రేమగా పిలవ డం తెలియనివాడు – శారద కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగినై.

'ఏవిటి శారదా అది' మాలిని బుజంమీద చెయ్యివేసి అడిగింది.

'ఏం లేదు కంట్లో ఏదో పడింది. వస్తా థాంక్స్' అని శారద బాబుని తీసికొని వచ్చేసింది.

ఆ రోజు ఉదయం పదిగంటల ప్లేన్ కి రాజు వస్తున్నాడు. ఇంట్లో అంతా తెల్లవారు జామున లేచి సందడిగా తిరుగుతున్నారు. శారదకి ఆ రాత్రి నిద్ర పట్టలేదు. రాత్రి అనంతంగా తోచి ఎంతకీ తెగలేదు. శారద కళ్ళు నిద్రలేక ఎర్రబారినై. శారద దగ్గిరుండి రాజు గది శుభ్రం చేయించింది. బాబుకి తలంటి స్నానం చేయించింది. కొత్త సూట్ తొడిగింది. తను రోజా రంగు షిఫాన్ చీర కట్టుకుంది. అది బాగా లేదని విప్పేసింది. రాజు కిష్టమైన లేతనీలం పట్టుచీర కట్టుకుంటూ 'ఏవిటో లా వెక్కి పోయాను అసహ్యంగా' అనుకుంది.

మామగారూ, మరిదీ ఏర్ పోర్ట్ కి వెళ్ళటానికి సిద్ధమవుతున్నారు. తనూ వెళ్దామనుకుంది శారద. కాని అత్తగారు 'వాడొచ్చేప్పటికి గుమ్మంలో ఎర్రనీళ్లు తీసెయ్యొద్దూ. మీరు వెళ్ళి తీసుకురండి. నేనూ కోడలూ ఇంట్లో ఉంటాం' అంది. అత్తగారికి కాలు నిలవటం లేదు. ఇంట్లోకి బయటికి పూరికే తిరుగుతోంది. వాళ్ళని వీళ్ళని కేక వేస్తోంది. శారద కేమీ తోచటం లేదు. గడియారం కేసి చూస్తోంది. ఈ నిమిషాలు మరీ నిదానం! అని విసుక్కుంది. పదిన్నరైంది. కారు వస్తున్న చప్పుడు విన్పించింది. కారిడర్ లోకి కారు వచ్చి ఆగింది. అందులోంచి రాజు దిగాడు. అతని మెడనిండా పూలదండలు.

రాజు...రాజు. దిగాడు — శారద గుండెలు గబగబా కొట్టుకున్నాయి. గుమ్మం పట్టుకొని నుంచుంది. అత్తగారు

గబగబా మెట్లు దిగివెళ్ళి రాజుని కావిలించుకుంది. చెక్కిళ్ళు నొక్కింది. 'చిక్కిపోయావేంరా?' అంది. రాజు శారదని చూచాడు. తను ఎత్తుకుని నుంచున్న బాబుని చూశాడు. రాజు కళ్ళలో పొంగిన ప్రేమ రెపరెప కొట్టుకుంటోంది. ముందుకు పరుగెత్తబోయాడు.

'ఒక్క నిమిషం ఆగు నాయనా! ఎర్రనీళ్ళు తీసెయ్యనీ' అంది అత్తగారు.

రాజు చేతులుచాస్తున్నాడు. శారదని రమ్మంటున్నాడు. బాబుని రమ్మంటున్నాడు. బాబు నెత్తుకుని నుంచున్న శారద కదల్లేక పోతోంది. సంతోషం ఉప్పెనలా ముంచుతోంది. బాబు శారద గుండెల మీద చేతుల్తో కొడ్తూ 'అమ్మా ... అమ్మా ... ఎవరే ఆ అబ్బాయి?' అన్నాడు.

ఆ మాటలు విన్న శారదకి స్పృహ తప్పుతోంది. బాబుని క్రిందికి వదిలేసింది. రాజు అమాంతం వచ్చి బాబుని కౌగలించుకున్నాడు. బాబు బిత్తర చూపులు చూస్తున్నాడు. మామగారు. అత్తగారు, మరిది బాబు చేత అనిపిస్తున్నారు 'అను...నా...ఆ...న్న...నాన్న...'

బాబు సిగ్గుపడుతూ ఒత్తి అంటున్నాడు 'నా ... ... ఆ...న్న...'

వియోగార్ణవపు ఆఖరి అల శారద ముఖం మీద అతి తీవ్రంగా కొట్టినప్పుడు ఆమెలో చైతన్యమే పోయింది.